క్లుప్తంగా

వేగవంతంగా విభిన్న ప్రతిభావంతుల సర్వే

భట్టిప్రోలు: మండలంలో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల సర్వే వేగవంతంగా జరుగుతోంది. సమగ్ర శిక్ష ఆంధ్రప్రదేశ్ ఆదేశానుసారం ఈ నెల 17 నుంచి సర్వే నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు భట్టిప్రోలు మండలంలో 18 మంది సీడబ్ల్యూఎస్ఎన్ (విభిన్న ప్రతిభావంతులు) చిన్నారులను గుర్తించి, స్థానిక ప్రాథమిక, హైస్కూల్స్‌లలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో భట్టిప్రోలు-1,2 ఎంఈవోలు పులి లాజర్, నీలం దేవరాజు, సీఆర్పీలు, ఐఈడీ టీచర్లు పార్ట్ టైం ఇన్‌స్పెక్టర్లు, ఎమ్మార్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాల్వ పూడికతీత

వెంకట్రాజునగర్ (భట్టిప్రోలు): ఓలేరు పంచాయతీ పరిధి వెంకట్రాజునగర్‌లోని మురుగు కాల్వలో శనివారం పూడికతీత పనులు చేపట్టారు. స్థానికులు కాలువ సమస్యను రాష్ట్ర మంత్రి మేరుగ నాగార్జున దృష్టికి తీసుకెళ్లడంతో.. పంచాయతీ అధికారులు ప్రొక్లెయినర్‌తో పూడిక తీయించారు. పనులను సర్పంచ్ మేరుగ రంగారావు, ఎంపీటీసీ సభ్యురాలు నీలా సాంబమ్మ పర్యవేక్షించారు.

తాగునీటి సరఫరాను అడ్డుకున్న గ్రామ సర్పంచ్

నగరం: ప్రజల అవసరాలు తీర్చాల్సిన గ్రామ సర్పంచే ప్రతిబంధకంగా మారి తాగునీటి సరఫరాను అడ్డుకోవడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అద్దంకివారిపాలెం గ్రామ సర్పంచ్ విచారపు పావని తాగునీటి సరఫరా జరగకుండా రక్షిత మంచినీటి పథకం పంపుహౌస్‌కు తాళాలు వేయడం సమంజసం కాదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్లితే అద్దంకివారిపాలెం పంచాయతీ పరిధిలోని ఉయ్యూరివారిపాలెం, కొండవీటివారిపాలెం, వీరంకివారిపాలెం, పడమటి బందెలవారిపాలెం, బొర్రావారిపాలెం గ్రామాల్లోని 600 కుటుంబాలకు రక్షిత మంచినీటి పథకం నుంచి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. పంప్ హౌస్ మోటారు మరమ్మతుల కారణంగా కొద్ది రోజులు నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. గ్రామ సర్పంచ్ పావని పట్టించుకోకపోవడంతో.. స్థానిక ఎంపీటీసీ లుక్కా బాపనయ్య మోటార్ మరమ్మతులు చేయించారు. తాగునీటి సరఫరాను పునరుద్ధించారు. దీంతో గ్రామ సర్పంచ్ పావని తాగునీటి సరఫరాను అడ్డుకున్నారు. రక్షిత మంచినీటి పథకం పంపుహౌస్‌కు తాళాలు వేసి, తాగునీరు రాకుండా అడ్డుకున్నారు. ప్రజల దాహార్తిని తీర్చాల్సిన సర్పంచ్ రాజకీయాలు ప్రదర్శించడం ఏమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి తాగునీటిని పునరుద్ధించాలని కోరుతున్నారు. ఈవిషయమై ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్‌ను వివరణ కోరగా ప్రజలకు తాగునీటి సరఫరా యధావిధిగా జరిగేలా చర్యలు చేపడతామన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

బాపట్ల: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్యాడిసన్ పేటలో ఇళ్ల నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఇంకా నిర్మాణాలు మొదలుపెట్టని వారు.. వెంటనే ప్రారంభించాల్సిందిగా సూచించారు. డీఈ శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

తిరగబడిన ట్రాక్టర్ ట్రక్కు

కోనేటిపురం(భట్టిప్రోలు): కోనేటిపురం వద్ద ఇసుక ట్రాక్టర్ ట్రక్కు తిరగబడింది. శనివారం భట్టిప్రోలు వైపు నుంచి రేపల్లె మార్గంలో ట్రాక్టర్ వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రాణహాని జరగలేదు. ఎదురుగా ఆర్టీసీ బస్సు రావడంతో సైడ్ మార్జిన్ దిగడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో గంట సేపు ఇరు వైపులా వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటే.. విద్యార్థులు సురక్షితం

బాపట్లటౌన్: డ్రైవర్లు అప్రమత్తంగా ఉన్నప్పుడే విద్యార్థులు సురక్షితంగా ఉంటారని డీఎస్పీ టి.వెంకటేశులు తెలిపారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని స్కూల్స్, కళాశాలల బస్ డ్రైవర్లకు పట్టణంలోని ఎన్‌జీవో హోంలో అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ టి.వెంకటేశులు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల, కళాశాలల బస్సులను నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ నియయ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలను నడపరాదని, పరిమితి వేగంతోనే వాహనాన్ని నడపాలని, పిల్లలు బస్సులో ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు తగు జాగ్రత్తలు వహించాలని, డ్రైవింగ్ చేస్తున్న సమయంలో సెల్ ఫోన్లలో మాట్లాడరాదని తదితర సూచనలు చేశారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రంగరావు మాట్లాడుతూ వాహనాలు ఎప్పటికప్పుడు సరైన కండిషన్లో ఉంచుకోవాలన్నారు. స్కూల్ వాహనాలు నడిపే డ్రైవర్లు ప్రతి మూడు నెలలకు ఒకసారి హెల్త్ చెకప్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల టౌన్ సీఐ పి.కృష్ణయ్య, ట్రాఫిక్ ఎస్ఐ సుధాకర్ పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

భట్టిప్రోలు: జగనన్న విద్యా కానుకలో భాగంగా సెమిస్టర్-2 పాఠ్య పుస్తకాలను టీఎంరావు హైస్కూల్‌లో శనివారం సర్పంచ్ దారా రవి కిరణ్మయి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి విద్యార్థులకు అందజేశారు. హెచ్ఎం రామ కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామస్థాయి పెంచిన సచివాలయం

- అన్ని రకాల ప్రభుత్వ సేవలు గ్రామ సచివాలయంలోనే
- పరిపాలనను గ్రామస్థాయికి తీసుకొచ్చిన ప్రభుత్వం
- నూతన భవనాలు, అధికారులతో పెరిగిన గ్రామ పరిధి
- సకాలంలో సంక్షేమ పథకాలు, ఇంటి ముంగిటకే సేవలు

సచివాలయ వ్యవస్థ గ్రామస్థాయిని పెంచింది. మండల కేంద్రాలకు సమస్యల పరిష్కారానికి పరుగులు తీసే శ్రమను గ్రామస్తులకు తగ్గించింది. పరిపాలన వ్యవస్థను గ్రామ స్థాయికి తీసుకురావడంతో.. అన్ని సేవలు సకాలంలో అందుతున్నాయి. ఆదాయ ధ్రువీకరణ పత్రం నుంచి.. సంక్షేమ పథకాల లబ్ధి వరకు అన్నీ ఇంటిముంగిటకే అందుతున్నాయి. సచివాలయం, వలంటీర్ వ్యవస్థల రాకతో.. పల్లెటూరి స్వభావమే పూర్తిగా మారిపోయింది.

వేమూరు: ప్రజలకు సేవలు గ్రామస్థాయిలోనే సులువుగా అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ ప్రజలకు వరంలా మారింది. అన్ని రకాల ప్రభుత్వ సేవలను ఒక చోటే అందించే విధంగా ఏర్పాటు చేసిన సచివాలయాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. పౌర సేవల కోసం కాళ్లరిగేలా తిరిగే రోజులు పోయాయి. అవినీతికి తావు లేకుండా ప్రజల వద్దకే సేవలను వలంటీర్ల ద్వారా అందిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొలువుదీరిన కొద్ది సమయంలో అత్యాధునిక సౌకర్యాలతో గ్రామ సచివాలయ భవనాలు ఏర్పాటయ్యాయి.

శరవేగంగా భవన నిర్మాణాలు

వేమూరు నియోజకవర్గంలో 71 గ్రామ సచివాలయ భవనాల నిర్మాణాలకు ఒక్కో సచివాలయం నిర్మాణానికి రూ.40 లక్షల చొప్పున ప్రభుత్వం రూ.28 కోట్లు మంజూరు చేసింది. భవన నిర్మాణాలు కూడా శరవేగంగా జరుగుతున్నాయి.

సేవల నిలయం..సచివాలయం

గతంలో ప్రజలు పౌర సేవలు పొందాలంటే గ్రామాల నుంచి మండల కేంద్రాలకు వెళ్లి అధికారుల కోసం కోసం పడి గాపులు కాయాల్సి వచ్చేది. పట్టాదారు పాస్ పుస్తకం, కుల ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, పెన్షన్ల మంజూరుకు నానా అవస్థలు పడేవారు. నెలలు తరబడిన ధ్రువీకరణ పత్రాలకు.. అధికారులకు ముడుపులు ఇవ్వనిదే మోక్షం లభించని దుస్థితి. సచివాలయ వ్యవస్థ రాకతో.. ప్రజలకు ప్రభుత్వం ద్వారా అందే అన్ని సేవలు గ్రామస్థాయిలో అందించే వెసులుబాటు కలిగింది.



చినపరిమి గ్రామ సచివాలయం

వేమూరు మండలంలో సచివాలయాలు, సంక్షేమ పథకాలు, లబ్ధిదారులు ఇలా..

గ్రామ సచివాలయాలు	14
అమ్మ ఒడి	3,119
విద్యా దీవెన	1,131
వసతి దీవెన	1,131
వాహన మిత్ర	128
వైఎస్సార్ చేయూత	2,045
కాపు నేస్తం	691
ఈబీసీ నేస్తం	182
చేదోడు	62
నేతన్న నేస్తం	30
వైఎస్సార్ ఆసరా తీసుకుంటున్న లబ్ధిదారులు	9,590
రైతు భరోసా	2,986
ఆరోగ్య శ్రీ	152

సంక్షేమ పథకాలు పరుగులు

గ్రామ సచివాలయ వ్యవస్థకు వలంటీర్లను ఏర్పాటు చేసి, ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తోంది. గతంలో పింఛన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు, వితంతవులు పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపులు కాసేవారు. ప్రస్తుతం వలంటీర్లు ప్రతి నెలా 1వ తేదీన ఉదయం ఇంటికెళ్లి పింఛన్ల నగదు అందిస్తున్నారు. రెవెన్యూ పరమైన సేవలు కూడా..సచివాలయాల్లోనే అందించడంతో.. రైతులకు, విద్యార్థులకు మేలు జరుగుతోంది. అధికారుల కోసం వేచి చూసే పని లేకుండా.. అధికారులే ప్రజల కోసం ఎదురు చూసే పరిస్థితులను ప్రభుత్వ తీసుకొచ్చింది.

సులువుగా రెవెన్యూ సేవలు



పట్టాదారు పాస్ పుస్తకాలు, రెవెన్యూ పరమైన సేవలకు గతంలో మండల, డివిజన్, జిల్లా కేంద్రాలకు రోజుల తరబడి తిరిగే వాళ్లం. శిస్తు చెల్లించడానికి కూడా అధికారులు చుట్టూ తిరిగాల్సి వచ్చేది. సచివాలయం వ్యవస్థ వచ్చిన తర్వాత అన్ని రకాల రెవెన్యూ సేవలు గ్రామాల్లో అందుతున్నాయి. లంచాలు ఇవ్వకుండా రెవెన్యూ సేవలు పొందే రోజులు రావడం సంతోషంగా ఉంది.

– బొల్లిముంత ఏడుకొండలు, రైతు, చదలవాడ.

ఇంటి వద్దకే పింఛను..



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రతి నెలా 1వ తేదీనే తెల్లవారు జామునే వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్లు అందజేస్తున్నారు. పింఛన్ల కోసం ఇబ్బందులు పడే రోజులు పోయాయి.

– అలపర్తి రవి, డప్పు కళాకారుడు, జంపని.

కులమతాలకు, రాజకీయాలకతీతంగా సంక్షేమపథకాలు

- ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు
- అడవులదీవిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

నిజాంపట్నం: కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. అడవులదీవి సచివాలయం-1 పరిధిలోని కాటూరివారిపాలెం, మేకావారిపాలెం, మహ్మదీయపాలెం, శొంఠివారిపాలెం, నాయుడువారిపాలెం, తోటావారిపాలెం గ్రామాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. పలు గ్రామాల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎంపీ మోపిదేవి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఎంపీ మోపిదేవి త్వరలోనే రోడ్ల నిర్మాణాలను పూర్తిచేసి, సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా పలువురు అర్హత ఉండి ఇళ్ల స్థలాలు రాలేదని తెలపడంతో.. పరిశీలించి, స్థలాలు అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. సంక్షేమ పథకాలు అందించి, ఆదుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న రోజుల్లో మరోసారి అండగా నిలవాలని ఎంపీ మోపిదేవి మహిళలను కోరారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి మదన్, ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, సర్పంచ్ శొంఠి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, మాజీ ఎంపీపీ ప్రసాదం వాసుదేవ, ఎంపీటీసీ నాజర్‌ఖాన్, పరమేశ్వరరావు, రైతుబాబు, చల్లామోహన్ పాల్గొన్నారు.

ఓటర్ల సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

రేపల్లె: పట్టణంలోని జరుగుతున్న ఓటర్ల సర్వేను శనివారం ఆర్డీవో జగన్నాథం పార్థసారథి పరిశీలించారు. బీఎల్వోలు ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలు, నకిలీ ఓట్లను గుర్తించి వాటిని తొలగించే ప్రక్రియ నిర్వహించాలని సూచించారు. వందేళ్ల వయస్సు పైబడిన వారిని ప్రత్యేకంగా గుర్తించాలని చెప్పారు. డోరు నంబర్లు లేని, ఒకే డోర్ నంబరుపై పదుల సంఖ్యలో ఉన్న ఓట్లు పరిశీలించాలన్నారు. సర్వీసు ఓటర్లు(మిలటరీ), ఎఆర్‌ఐ ఓటర్ల వివరాలను సరిచేయాలన్నారు. దీర్ఘకాలంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను వారి ఇష్టం మేరకు ఏ ప్రాంతంలో ఉంచాలో కనుక్కుని అక్కడి జాబితాలో చేర్చాలని స్పష్టం చేశారు. ఒక బూత్‌లో సరాసరి 1,500 ఓట్లకు మించి ఉంటే కొత్త బూత్‌కు సిఫార్సు చేయాలని తెలిపారు. ఓటు కార్డులపై స్పష్టత లేని ఫొటోలు తొలగించి, మంచి ఫోటోల ఏర్పాటు చేయటంతో పాటు జిల్లా ఎన్నికల అధికారికి పంపించాలన్నారు. అనంతరం పట్టణంలో ఏర్పాటు చేస్తున్న పలు పోలింగ్‌బూత్‌లను ఆర్డీఓ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయసారథి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



లాల్‌బహదూర్ స్కూలులోని పోలింగ్‌బూత్ పరిశీలనలో ఆర్డీఓ పార్థసారథి

పెదపులివర్రు(భట్టిప్రోలు): పెదపులివర్రు పంచాయతీ జిలుగువారిపాలెంలో జరుగుతున్న సమగ్ర ఓటరు సర్వేలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి శనివారం పాల్గొన్నారు. బీఎల్వోలకు ఓటరు వెరిఫికేషన్‌లో పలు సూచనలు చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి 'జగనన్న సురక్ష'



ధ్రువపత్రం అందజేస్తున్న ఎంపీ మోపిదేవి



కూచిపూడిలో మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న డీఆర్వో గంధం రవీందర్

నిజాంపట్నం: ప్రజలకు సులభతరంగా అవసరమైన సర్టిఫికెట్లను ఇచ్చి, సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు తెలిపారు. శనివారం అడవులదీవి సచివాలయం-2లో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. దళారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుని ఖాతాలో జమచేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా జగనన్న ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. అందుకు నిదర్శనం గత ప్రభుత్వ హయాంలో 800ల మందికి పింఛన్లు అందిస్తే ప్రస్తుతం.. 1200కు పైగా పింఛన్లను అందిస్తున్నట్లు తెలిపారు. గడిచిన నాలుగేళ్లలో అడవులదీవి పచాయతీ పరిధిలో వివిధ రకాల సంక్షేమ పథకాల ద్వారా సుమారు రూ.60 కోట్లకు పైగా లబ్ధిదారులకు అందించడం జరిగిందన్నారు. అభివృద్ధిపై టీడీపీ నేతలకు ఎంపీ మోపిదేవి బహిరంగ సవాల్ విసిరారు. ఎక్కడైనా చర్చకు రావాలని కోరారు. అడవులదీవి గ్రామంలో రూ.2కోట్లతో 24గంటల విద్యుత్ సరఫరా ఏర్పాటుకు నూతన స్తంభాలు, విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అదే విధంగా రూ.20కోట్లతో మంచినీటి స్కీంను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పలువురికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. డీసీఎంఎస్ చైర్మన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి మదన్, ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, సర్పంచ్‌లు శొంఠి శ్రీనివాసరావు, తోకల అశోక్, ఎంపీడీఓ నాగలక్ష్మి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 'జగనన్న సురక్ష'

నగరం: ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి జగనన్న సురక్ష కార్యక్రమం దోహదపడుతుందని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య అన్నారు. బొరమాదిగపల్లి సచివాలయంలో శనివారం జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో ఎంపీపీ పాల్గొన్నారు. 1200 మందికి ధ్రువీకరణ పత్రాలు అందించినట్లు అధికారులు వెల్లడించారు. తహసీల్దారు ఎం.శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ చందోలు దేవదాసు, ఎంపీటీసీ శ్రీమన్నారయణ పాల్గొన్నారు.

ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు

కూచిపూడి(వేమూరు): ఎలాంటి అవకతవకలు, లంచాలతో పనిలేకుండా నేడు సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు ఇంటి వద్దకే అందుతున్నాయని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. అమర్తలూరు మండలంలోని కూచిపూడ గ్రామ సచివాలయంలోని జగనన్న సురక్ష శిబిరంలో శనివారం ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులకు వివిధ రకాలు సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీపీ రాపర్ల నరేంద్ర, గ్రామ సర్పంచ్ కొండమూది శ్యామల, పెదపూడి ఆనంద్, ఎంపీటీసీ సుమలత, యలవర్తి సురేష్ అధికారులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను సద్వినియోగం చేసుకోవాలి

బాపట్ల అర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష శిబిరాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎ.రాధాకృష్ణ సూచించారు. శనివారం తూర్పు బాపట్ల, పిన్నిబోయినవారి పాలెం గ్రామాల్లో జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. పిన్నిబోయినవారిపాలెం సచివాలయంలో 988 మందికి, తూర్పు బాపట్ల సచివాలయం పరిధిలో 1756 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. బాపట్ల జిల్లా రెవెన్యూ అధికారి గంధం రవీందర్, విద్యాశాఖ అధికారి పి.వి.జె.రామారావు, తహసీల్దారు సుధారాణి, ఈఓపీఆర్డీ పులి శరత్‌బాబు, తూర్పు బాపట్ల పంచాయతీ సెక్రటరీ పల్నాటి శ్రీరాములు, బాపట్ల మండలాధ్యక్షుడు చిన్న పోతుల హరిబాబు, జెడ్పీటీసీ పిన్నిబోయిన ఎస్తేరు రాణి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిన్ని బోయిన ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కోకి రాఘవరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డేవిడ్ పాల్గొన్నారు.

ఆ అర్హత పవన్, చంద్రబాబుకు లేదు..

పిట్టలవానిపాలెం: గ్రామ, వార్డు సచివాలయ, వలంటీర్ వ్యవస్థల గురించి మాట్లాడే అర్హత పవన్ కల్యాణ్, చంద్రబాబునాయుడికి లేదని బాపట్ల శాసన సభ్యుడు కోన రఘుపతి అన్నారు. మండలంలోని కోమలి గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. కోవిడ్ మహమ్మారి సమయంలో సొంత కుటుంబ సభ్యులే దగ్గరకు రాలేని పరిస్థితిలో ఇంటింటికీ వెళ్లి ప్రజల వారి ఆరోగ్య పరిస్థితిని వలంటీర్లే తెలుసుకున్నారని గుర్తుచేశారు.

పాలనలో దేశానికే ఆదర్శం ఆంధ్రప్రదేశ్

పిట్టలవానిపాలెం: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పాలన దేశానికే ఆదర్శమని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. సంగుపాలెం, కోమలి గ్రామ సచివాలయాల్లో శనివారం జగనన్న సురక్ష శిబిరాలు జరిగాయి. సంగుపాలెంలో గ్రామ సర్పంచ్ ఎనికేపల్లి శివకుమారి, కోమలిలో సర్పంచ్ శ్యామల నాగిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంక్షేమ పథకాలతో పాటు, రాష్ట్ర అభివృద్ధిని పరుగులు తీయిస్తోందన్నారు. గతంలో జగన్మభూమి కమిటీల సిఫార్సు ఉంటేనే అధికారులు సర్టిఫికెట్‌లు ఇచ్చే దౌర్భాగ్య పరిస్థితులు ఉండేవన్నారు. కానీ జగనన్న పాలనలో ఇళ్ల వద్దకే అన్ని రకాల సర్టిఫికెట్‌లు, సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. బాపట్ల ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, వైఎస్ ఎంపీపీ చేబ్రోలు కృపానందం, ఎంపీటీసీ చెన్నుబోయిన గంగయ్య, సచివాలయ మండల కన్వీనర్ అల్లూరి సురేష్ బాబు, మంతెన గంగరాజు, బడుగు ప్రకాశరావు, మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, కుంతం ప్రసన్నరాజు, డి.వెంకటేశ్వర రెడ్డి, సొసైటీ చైర్మన్‌లు మండే విజయ్‌కుమార్, శ్యామల వీరారెడ్డి, కూసంపూడిదేవేంద్రరాజు, కత్తి యోహాను, శివన్నారాయణరెడ్డి, బాపట్ల డీఎల్‌డీఓ సువార్త, ఎంపీడీఓ భవనం మారుతీ శేషమాంబ, కార్యదర్శులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీ లోకి భారీగా చేరికలు



తోటావారిపాలెంలో ఎంపీ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరుతున్న మాజీ ఎంపీటీసీ గోపాలకృష్ణ



శొంఠివారిపాలెంలో వైఎస్సార్ సీపీలో చేరుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

-కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎంపీ మోపిదేవి

నిజాంపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరేందుకు భారీగా ముందుకు రావడం హర్షణీయమని ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు తెలిపారు. మండలంలోని తోటావారిపాలెంలో టీడీపీ నాయకులు, మాజీ ఎంపీటీసీ కొలసాని గోపాలకృష్ణతో పాటు పలువురు కార్యకర్తలు శనివారం ఎంపీ మోపిదేవి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. అదే విధంగా శొంఠివారిపాలెంలో టీడీపీ నాయకులు జంపాని నరసింహరావు, గోవిందు, ఉప్పాల ప్రసాదు, ఉప్పాల మునేశ్వరరావు, మొర్ల రమణ, శివబాబు, మొగదారయ్య, సుబ్బారావుతో పాటు మరో 20మంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎంపీ మోపిదేవి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. రాష్ట్రంలో ప్రజారంజకమైన పాలన సాగుతోందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నారన్నారు. పాలన మెచ్చి పార్టీలో చేరుతున్నామని టీడీపీ నాయకులు, కార్యకర్తలు తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి మదన్, సర్పంచ్ శొంఠి శ్రీనివాసరావు, కూచినపూడి సహకార సొసైటీ అధ్యక్షుడు నల్లపాటి రామయ్య, ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, మాజీ ఎంపీపీ ప్రసాదం వాసుదేవ, బండారు రామారావు, మార్కెట్ యార్డు డైరెక్టర్ కొలసాని పరమేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరు కేసులు పరిష్కారం..రూ.40లక్షల నష్టపరిహారం



లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తులు

బాపట్ల: బాపట్ల కోర్టు సముదాయంలో ప్రత్యేక లోక్ అదాలత్ శనివారం నిర్వహించారు. పలు కేసులు పరిష్కరించి, రూ.40.60లక్షల నష్ట పరిహారాన్ని కక్షిదారులకు అందజేశారు. ప్రత్యేక లోక్ అదాలత్ న్యాయమూర్తి బి.సాధుబాబు, నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి కె.ఎస్.రామకృష్ణరావు ఆరు కేసులను పరిష్కరించారు. వాహన ప్రమాద కేసులను పరిష్కారించి కక్షిదారులకు నష్టపరిహారాన్ని ఇప్పించారు. ఈ కార్యక్రమంలో లోక్‌అదాలత్ సభ్యులు శివకుమార్, ఏఎస్‌వీ ఆర్ఎస్ చలపతిరావు తదితరులు ఉన్నారు.

ఏకలవ్య విగ్రహానికి విరాళం

భట్టిప్రోలు: వెల్లటూరులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఏకలవ్య విగ్రహానికి పారిశ్రామికవేత్త వేములపల్లి రవికిరణ్ రూ.50 వేలు విరాళం అందజేశారు. శనివారం వెల్లటూరులో అమృతలూరు మాజీ ఎంపీపీ మైనేని రత్నప్రసాద్ సమక్షంలో నగదును విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. పమిడిముక్కల కిరణ్ జ్ఞాపకార్థం వేములపల్లి రవికిరణ్ మిత్ర బృందం తరుపున మరో రూ.20 వేలు కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాట్రగడ్డ గోపాల్, సజ్జా చందు, సున్నా అజయ్, ఆరేపల్లి ప్రవీణ్, అమృతలూరు శ్రీహరి, పిన్నమనేని ఉపేంద్ర, పరుచూరి బుచ్చికోటయ్య, బొడ్డు ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, పోతురాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.